ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి


జిల్లా వార్తలు


5★

మంగళవారం 2 ఏప్రిల్ 2024

విద్యుత్ ఉత్పత్తిని..
అధిగమించిన రామగుండం ఎన్టీపీసీ 7

సమస్యల చెంత.. వార సంత
- సుల్తానాబాద్‌లో రోడ్డుపైనే వ్యాపారాలు 8





మారని తీరు

- బీజేపీలో ఎక్కడి గ్రూపులు అక్కడే..
- పట్టించుకోని పార్టీ అధిష్ఠానం
- పార్లమెంట్ ఎన్నికల వేళ తలనొప్పిగా మారిన వ్యవహారం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో పార్టీ అధ్యక్షులు మారుతున్నా కూడా పార్టీలో పరిస్థితులు మారడం లేదు. పార్లమెంట్ ఎన్నికల వేళ నేతల మధ్య సమన్వయం కొరవడడంతో ఎంపీ అభ్యర్థికి తలనొప్పిగా మారింది. దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ హవా వీస్తున్నా కూడా పెద్దపల్లి జిల్లా బీజేపీ నేతలంతా వర్గాలుగా విడిపోవడంతో పార్టీ దిగువ శ్రేణి నాయకులు, కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. జిల్లా ఏర్పాటైన నాటి నుంచి ముగ్గురు జిల్లా అధ్యక్షులు మారారు. తాజాగా జిల్లా అధ్యక్షుడిగా మంథనికి చెందిన చంద్రుపట్ల సునీల్‌రెడ్డిని పార్టీ అధిష్ఠానం నియమించినప్పటికీ, ఆయన కూడా నేతల మధ్య సమన్వయం చేయలేక పోతున్నారు. రాష్ట్ర పార్టీ అధిష్ఠానం ఏ ఒక్క రోజు కూడా పెద్దపల్లి జిల్లాపై దృష్టి సారించలేదని అంటున్నారు. ఏమాత్రం పట్టించుకోని కారణంగానే జిల్లాలో బీజేపీ చెల్లాచెదురుగా తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి పోటీ చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్‌కు 6,312 ఓట్లు రాగా, మంథని నుంచి పోటీ చేసిన చంద్రుపట్ల సునీల్ రెడ్డికి 5,680 ఓట్లు, రామగుండం నుంచి పోటీ చేసిన కందుల సంధ్యారాణికి 12,956 ఓట్లు వచ్చాయంటే ఆ పార్టీ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రావుల రాజేందర్‌ను మార్చి చంద్రుపట్ల సునీల్ రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా నియమించినా కూడా పరిస్థితిలో మార్పు రావడం లేదని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్‌లు రెండు వర్గాలుగా పార్టీని నడిపిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు గుజ్జుల వర్గానికి ఆహ్వానం లేకపోవడంతో వాళ్లు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. మార్చిలో జరిగిన కేంద్ర మంత్రి రూపాలా బస్సు యాత్ర జరిగిన సందర్భంగా గుజ్జుల వర్గానికి ఆహ్వానం లేదని చెబుతున్నారు.

● ఎంపీ అభ్యర్థి ప్రచారం ప్రారంభించినా..

మే నెలలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చి బీజేపీలో చేరిన గొమాసే శ్రీనివాస్ పెద్దపల్లిలో ఎన్నికల ప్రచారం ప్రారంభించినప్పటికీ ఆయనకు పార్టీ శ్రేణుల నుంచి తగిన మద్దతు లభించడం లేదు. ప్రచారంలో పాల్గొనాలని తమను ఎవరు కూడా సమాచారం ఇవ్వని కారణంగా ప్రచారంలో పాల్గొనడం లేదని గుజ్జుల వర్గీయులు చెబుతున్నారు. అభ్యర్థి పార్టీకి కొత్త అయినా అందరు నాయకుల వద్దకు వెళ్లి స్వయంగా కలుస్తున్నా కూడా తనతో అందరు కలిసి రావడం లేదు. రామగుండం నియోజకవర్గంలోనూ కందుల సంధ్యారాణి, రావుల రాజేందర్ వర్గాలుగా విడిపోయారు. ఇక్కడ కూడా జరుగుతున్న పార్టీ కార్యక్రమాలు సమన్వయంతో జరగడం లేదు. ఏళ్ల తరబడి బీజేపీ జెండా మోసిన నాయకులు కొందరు తమకు టిక్కెట్ రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా అప్పటికప్పుడే ప్యారాచూట్‌లా వచ్చి పార్టీలో చేరే వారికి టికెట్లు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరో 16 రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లి విజయం సాధించాలని చూస్తున్నారు. కానీ పార్టీ నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం తలనొప్పిగా మారింది. ఇప్పటికైనా పార్టీ అధిష్ఠానం జోక్యం చేసుకుని వెంటనే పార్టీ నాయకులందరితో సమావేశం నిర్వహించి సమన్వయం చేస్తేనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు గట్టి పోటీనిచ్చే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంటున్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముస్లింలు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 1: ముస్లింలకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సోమవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా అందరితో సహపంక్తి భోజనం చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ మాసంలో ప్రతి ఏటా కఠోర ఉపావాస దీక్ష చేయడంతో పాటు, పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వివేక్, సయ్యద్ మస్రత్, మందల సత్యనారాయణరెడ్డి, సర్వర్ పాషా, సజ్జాద్, అక్బర్ అలీ, నూగిళ్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్, ఉనుకొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అంశాలను మేనిఫెస్టోలో చేర్చాలి

మంథని, ఏప్రిల్ 1: దేశంలో ఉన్న దాదాపు కోటి మందికిపైగా జనాభా ఉండి ఓటర్లలో 20 శాతంపైగా ఉన్న 21 రకాల వైకల్యం కలిగిన దివ్యాంగుల హక్కుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక మేనిఫెస్టోను అన్ని రాజకీయ పక్షాలు కూడా రాబోయే ఎన్నికల్లో తమతమ పార్టీల మేనిఫెస్టోలో చేర్చాలని దివ్యాంగుల హక్కుల పోరాట నేత ఇనుముల సతీష్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సోమవారం వికలాంగుల నెట్‌వర్క్ పూర్ణమిథం ఆధ్వర్యంలో ఓ సదస్సును నిర్వహించిది. నేషనల్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ ఫర్ డిసెబుల్డ్ పీపుల్ న్యూఢిల్లీ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన దక్షిణ భారత ప్రాంతీయ సదస్సులో రాజకీయ క్షేత్రంలో దివ్యాంగుల పాత్ర అన్న అంశంపై జరిగిన సెమినార్ నిర్వహించారు. రెండు రాష్ట్రాల ప్రతినిధులు, పలు వికలాంగుల హక్కుల సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈసందర్భంగా సెమినార్‌లో పాల్గొన్న ఇనుముల సతీష్ మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల్లో భారతదేశం గణనీయమైన ప్రగతి సాధించినప్పటికీ, రాజకీయంగా చేర్చుకోవడం ఒక సవాలుగా మారిందన్నారు. దివ్యాంగులకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలని, దేశంలో కోటికి మందికి పైగా జనాభా ఉన్న దివ్యాలాంగుల అభివృద్ధి కోసం సమగ్రమైన మేనిఫెస్టోను తయారు చేశామన్నారు. ఇది సక్రమంగా అమలు కావాలంటే రాజకీయ పార్టీలు కూడా దివ్యాంగుల కోసం తమ మేనిఫెస్టోలో పది అంశాలను చేర్చాలని డిమాండ్ చేశారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో 11.19లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి

- తెలంగాణకు 4.45లక్షల టన్నుల రవాణా

కోల్‌సిటీ, ఏప్రిల్ 1: ఆర్ఎఫ్‌సీఎల్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 11.19 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి జరిగినట్టు చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్‌కే ఝా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేకిన్ ఇండియా చొరవతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు నిర్మించిందని, దేశానికి ఆహార భద్రత కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఈ ఆర్థిక సంవత్సరంలో 11.19 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి జరుగగా అందులో నుంచి తెలంగాణకు 4.45 లక్షల టన్నులు, ఏపీకి 1.53లక్షల టన్నులు, కర్ణాటకకు 1.83లక్షల టన్నులు, మహారాష్ట్రకు 78.74వేల టన్నులు, ఛత్తీస్‌గఢ్‌కు 85.86వేల టన్నులు, తమిళనాడుకు 99వేల టన్నులు, మధ్యప్రదేశ్‌కు 74వేల టన్నుల యూరియా సరఫరా చేసినట్టు సీజీఎం తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో టన్నుకు 5గెగా క్యాలరీల గ్యాస్ వినియోగానికి డిజైన్ చేసి ఉండగా అత్యధిక సామర్థ్యంతో యంత్రాలు వినియోగించడం వల్ల 4.93గెగా క్యాలరీల గ్యాస్ వినియోగం జరిగిందన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి సాధనలో కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ఎస్‌కే ఝా కృతజ్ఞతలు తెలిపారు.

'పది' వొకేషనల్ పరీక్షకు 821 మంది హాజరు

- డీఈవో డి మాధవి

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 1: పదో తరగతి ఒకేషనల్ పరీక్షకు 821 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని తిమ్మిది పరీక్షా కేంద్రాల్లో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించిన పదో తరగతి ఒకేషనల్ పరీక్షలో 829 మంది విద్యార్థులకు గాను 821 మంది విద్యార్థులు హాజరు కాగా, 99.03 శాతం హాజరు నమోదు అయినట్లు తెలిపారు. డీఈవో ఒక పరీక్షా కేంద్రాన్ని, అసిస్టెంట్ కమిషనర్ పరీక్షల విభాగం ఒక పరీక్షా కేంద్రాన్ని సందర్శించారన్నారు. మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని, ఒకేషనల్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో తెలిపారు.

ఘనంగా భూలక్ష్మి,శ్రీలక్ష్మి బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న మహిళలు

కమాన్‌పూర్, ఏప్రిల్ 1: మండలంలోని గుండారం గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న భూలక్ష్మీ శ్రీలక్ష్మీ సహిత బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణాల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్థులతో పాటు వారి బంధుమిత్రులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

'కాళేశ్వరం' నుంచి జిల్లాకు చుక్క నీరు రాలేదు

- పత్తిపాక, పాలకుర్తి రిజర్వాయర్ల నిర్మాణాలు చేపడతాం - ఓట్ల కోసమే రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు - మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు

పెద్దపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంతంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జిల్లా ఒక్క చుక్క నీరు రాలేదని, నేటికీ ఎస్సారెస్పీ నీళ్లే దిక్కాయని, పత్తిపాక, పాలకుర్తి రిజర్వాయర్లు చేపట్టి రైతులు ఇబ్బందులు తీరుస్తామని, కట్టకుంటే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగమని, బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కోసమే రైతులపై మొసలి కన్నీళ్లు కారుస్తున్నదని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. సోమవారం పెద్దపల్లిలో ఆయన పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యం వల్ల రాష్ట్రంలో కొంత పంట నష్టం జరిగితే పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీఆర్ఎస్ రాజకీయం చేయడం సిగ్గుచేటు అన్నారు. అధికారంలో ఉన్న పది సంవత్సరాలపాటు రైతులను పట్టించుకోని కేసీఆర్ ఎంపీ సీట్ల కోసం మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అనుసరించిన విధానాల వల్ల రైతులకు పంట నష్టపరిహారం అందలేదని, లక్ష రూపాయల వరకు రుణ మాఫీ జరగ లేదని, వడ్డీ లేని రుణాలపై బకాయిలు విడుదల చేయక రైతులపై భారం పడిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ధాన్యం కొనుగోళ్లలో తరుగు లేకుండా చూశామని, బీఆర్ఎస్ హయాంలో క్వింటాలుకు ఐదు నుంచి పది కిలోల వరకు తరుగు తీసి రైతులను నిలువు దోపిడీ చేశారని మండిపడ్డారు. ఈ సీజన్‌లో ఒక్క గింజ తరుగు లేకుండా కొనుగోలు చేస్తామని అన్నారు. గత ప్రభుత్వం వడగళ్ల వానల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పి ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. గత ఏడాది 20 వేల ఎకరాలు, అంతకు ముందు 20 వేల ఎకరాల్లో రైతులు పంటలను కోల్పోయారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. చివరి ఆయకట్టు రైతుల పంట నష్టపోకుండా ఉండేందుకు తమ ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కూలిన తర్వాత ఉన్న నీటిని బయటకు వదిలి పెట్టింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. ఆ తర్వాత నిపుణుల సూచన మేరకు మిగతా బ్యారేజీల్లో నీళ్లు వదలాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ఉండేందుకు గత ప్రభుత్వ హయాంలో గడిచిన ఏడాది ఫిబ్రవరి, మార్చిలో వినియోగించిన కరెంట్ కంటే ప్రస్తుతం ఎనిమిది శాతం అధికంగా కరెంటు కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నామన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

రాష్ట్రంలో ఎటువంటి విద్యుత్ కొరతలు లేవని, ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకున్న అర్హులైన ప్రతీ ఒక్కరికి జీరో బిల్లు అందిస్తామన్నారు. సాంకేతిక సమస్యలతో జీరో బిల్లు రాకుంటే సంబంధిత ఎంపీడీవో కార్యాలయంతో పాటు మున్సిపల్ కార్యాలయంలో సవరణ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుకున్న వినియోగదారులు బిల్లులు కట్టాల్సిన అవసరం లేదని, బిల్లు కట్టకుండా విద్యుత్ సరఫరాను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించకుండా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఫోన్ టాపింగ్ అతిపెద్ద నేరమని, చట్టానికి ఎవరూ అతీతులు కారని తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని అన్నారు. బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి కడియం కావ్య లిక్కర్ స్కాం, ఫోన్ టాపింగ్ ఇతర అవినీతి ఆరోపణలపై ప్రజలకు జవాబు చెప్పలేకపోతున్నామని పోటీ నుంచి తప్పుకొని కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తమ ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గోపగాని సారయ్య గౌడ్, గుమ్మడి కుమారస్వామి, అంతం అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాశ రావు, సాయిరి మహేందర్, మందల సత్యనారాయణ రెడ్డి, కోట శ్రీనివాస్ గౌడ్, బూషణవేన రమేష్ గౌడ్, సయ్యద్ మస్రత్, తాడూరి శ్రీమాన్, బూతగడ్డ సంపత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, జగదీష్, ఈర్ల స్వరూప, దామోదర్ రావు, కొలిపాక సుజాత, ఎరుకల రమేష్, కొండి సతీష్, అక్బర్ అలీ, కల్వల శ్రీనివాస్, న్యాతరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మొట్లపల్లిలో ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 1: మండలంలోని మొట్లపల్లిలో మూడు రోజులగా విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చి వేద బ్రాహ్మణుల వేదమంత్రాలతో పూజలు, హోమాల్లో పాల్గొన్నారు. సోమవారం లక్ష్మీ గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, సీతారామ లక్ష్మణఆంజనేయ సహిత నవగ్రహ శివపార్వత నందీశ్వర, నాగదేవత, మదన పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు ధ్వజస్తంభన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వేద బ్రాహ్మణులు నిట్టూరు సతీష్ శర్మ ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీపీ నూనేటి సంపత్, జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ నల్ల మనోహర్ రెడ్డి, ఆ గ్రామ మాజీ సర్పంచులు తులా మనోహర్‌రావు, గోనే శ్యామ్, ఎంపీటీసీ బోల్లమల్ల కౌసల్య, శంకర్, మేకల మల్లేష్ యాదవ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మార్చాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఊట్ల వరప్రసాద్

పెద్దపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన గడ్డం వంశీని మార్చాలని పార్టీ జాతీయ యువజన నాయకుడు ఊట్ల వరప్రసాద్ సోమవారం పెద్దపల్లికి వచ్చిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి టికెట్ ఇవ్వాలని ఆయన కోరారు. ఈ విషయమై పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ వరకు అభ్యర్థిని మార్చకుంటే ఐదో తేదీన పెద్దపల్లిలో న్యాయ పోరాట దీక్ష చేపడతానని ఊట్ల వరప్రసాద్ పేర్కొన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ - జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



ధాన్యం తూకం వేస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 1: జిల్లాలో పండించిన ప్రతీ నాణ్యమైన గింజను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పకడ్బందీగా కొనుగోళ్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా జరగాలని, జిల్లాలో దాదాపు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 304 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడా కూడా ధాన్యం కటింగ్ చేయకుండా చూడాలని, రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీసీవో శ్రీమాల, డీఏవో ఆదిరెడ్డి, డీఎంవో ప్రవీణ్ రెడ్డి, డీఎస్‌వో ఎ ప్రేమ్‌కుమార్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● రైతులు పండించిన ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ పెద్దపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, యాసంగి పంట ధాన్యం కొనుగోలు చేసేందుకు వీలుగా జిల్లాలో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.

● రైతులకు ఇబ్బందులు కలగనీయవద్దు

సుల్తానాబాద్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా పారదర్శకంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ కేంద్రాల నిర్వాహకులకు, అధికారులకు సూచించారు. సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార శాఖ అధికారి జి శ్రీమాలతో కలసి అడిషనల్ కలెక్టర్ సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతు ఎలాంటి కటింగ్ లేకుండా రైతులనుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ట్రక్ షీట్లను వెంట వెంటనే ఇవ్వాలని, కేంద్రం నుంచి ధాన్యం మిల్లులకు వెళ్లిన తర్వాత రైతులకు ఎలాంటి బాధ్యత ఉండదని మిల్లర్ల సమస్యలకు రైతులకు ముడి పెట్టవద్దని ఆయన అధికారులకు సూచించారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన రెండు రోజుల్లోగా వారి ఖాతాల్లో చెల్లింపులు జరగాలన్నారు. ఆదే విధంగా రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుని సెంటర్లకు తీసుకురావాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాలు, డీసీఎంఎస్ తదితర సంస్థల ద్వారా 305 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల పదిలోగా ప్రారంభిస్తామని రైతులు తమకు అందుబాటులో ఉన్న కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు దరలను పొందాలని సూచించారు. గ్రామాల్లోకి వచ్చే దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో డీసీవో శ్రీమాల, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్, సురేందర్ రెడ్డి, తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, సీఈఓ బూరుగు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 1: రానున్న రెండు నెలల పాటు తాగునీటి సరఫరాలో ఇబ్బందులులేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సరఫరాపై అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసుకుని సన్నద్ధంగా ఉండాలన్నారు. ప్రతీ రోజు తాగునీటి సరఫరాను పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎక్కడ, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రతీ రైతు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు.

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా, టెంట్లు వంటి ఏర్పాట్లు చేయాలని సీఎస్ సూచించారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకుని రావడం, అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మతులు, తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం కల్పన వంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో నరేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే ప్రమోద్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి, డీపీవో ఆశాలత, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ కె పూర్ణచందర్, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ జి శ్రీను, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందించేలా చూడాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి టౌన్: జిల్లాలో ఉన్న ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా చేసేందుకు అవసరమైన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, రాబోయే 3 నెలల పాటు అధికారులు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి ఇబ్బందులు రాకుండా పటిష్ఠ కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించిన నివేదిక ప్రకారం ఎలిగేడులోని నేతకానిపల్లి, ఓదెలలో సుందిల్లపల్లి, కోతులపల్లి, పెద్దపల్లిలోని ఎస్సారెస్పీ కాలనీ, నాయక్ పల్లి గ్రామాలు మిషన్ భగీరథ కింద కవర్ కాలేదన్నారు. సదరు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వేసవి కాలంలో ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా ఏర్పాట్లు పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతీ నల్లా కనెక్షన్‌కు సమృద్ధిగా తాగునీరు సరఫరా చేయాలని, ఇందుకోసం గ్రిడ్, ఇంట్రా అధికారులు సమన్వయంగా పనిచేయాలని, ముర్మురులో ఉన్న వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నుంచి అవసరమైన మేర నీరు ప్రతిరోజు విడుదలయ్యే విధంగా పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఈవో డి మాధవి, డీపీవో ఆశాలత, మిషన్ భగీరథ ఈఈలు కె పూర్ణచందర్, జి శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విద్యార్థిని

తిమ్మాపూర్, ఏప్రిల్1: మండలంలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని ఓ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాకు చెందిన ఉప్పాల శ్రీహర్ష అనే విద్యార్థిని స్థానికంగా ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ సమీపంలోని ఓ గర్ల్స్ హాస్టల్‌లో ఉంటోంది.

సోమవారం రాత్రి హాస్టల్ నుంచి బయటికి వచ్చి రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతుండగా కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపునకు వెళ్తున్న ఓ యువకుడు బైక్‌ను అతివేగంగా నడుపుతూ ఆ విద్యార్థిని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో శ్రీహర్షకు తీవ్రగా యాలు కాగా స్థానికులు, ఎల్ఎండి పోలీసులు 108 వాహనంలో కరీంన గర్‌లోని ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 1: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,450 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 41మంది రైతులు 466క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,450, కనిష్ఠ ధర రూ.7వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఆలయాల్లో దొంగతనం

ఇబ్రహీంపట్నం, ఎప్రిల్ 1: మండలంలోని వర్షకొండ గ్రామంలో పలు దేవాలయల్లో అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, బ్రహ్మం గారి ఆలయం, పెద్దమ్మ, పంచముఖ, హన్‌మాన్ ఆలయలలో తాళాలు పగులగొట్టి దొంగతనం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాదాపుగా 3.5 గ్రాముల బంగారు అభరణాలు దొంగిలించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుల బైండోవర్

శంకరపట్నం, ఏప్రిల్ 1: శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీసులు సోమవారం బెల్ట్ షాపు నిర్వాహకులను తహసీల్దార్ కార్యాలయంలో హాజరు పరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని గద్దపాక, కాచాపూర్, రాజాపూర్, కన్నాపూర్, ధర్మారం గ్రామాలకు చెందిన 16మందిని తహసీల్దార్ కార్యాలయంలో హాజరు పరిచినట్లు తెలిపారు.

'నవోదయ' ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

చొప్పదండి,ఏప్రిల్1: నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. గత జనవరి 20న ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా మెరిట్, కేటగిరీ వారీగా ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 5న ఆధార్ కార్డు, హాల్‌టికెట్, ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో విద్యాలయంలో హాజరు కావాలని ఆమె తెలిపారు.

రాజరాజేశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీ



భక్తులతో సందడిగా ఉన్న ఆలయ ప్రాంగణం



కోడె మొక్కు చెల్లించుకుంటున్న మంత్రి కొండా సురేఖ

వేములవాడ, ఏప్రిల్ 1: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం సోమవారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి కృష్ణప్రసాద్ నేతృత్వంలో అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

కల్యాణం టికెట్ల కోసం భక్తుల ఇబ్బందులు

రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారి నిత్య కల్యాణం టికెట్ల కోసం భక్తులు ఇబ్బందులు పడ్డారు. శివ కల్యాణం ఉత్సవాల సందర్భంగా గత ఐదు రోజులుగా స్వామివారి నిత్య కల్యాణం టికెట్లు నిలిపి వేయగా, కల్యాణోత్సవాలు ముగిసిన నేపథ్యంలో సోమవారం స్వామివారి నిత్య కల్యాణం యథావిధిగా ప్రారంభించారు. కల్యాణంలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ముందు భాగంలోని కళాభవన్ మొదటి అంతస్తులో స్వామివారి నిత్య కల్యాణం నిర్వహిస్తారు. ఈ ప్రాంగణంలో పరిమిత సంఖ్యలోనే భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొనడానికి వీలవుతుంది. గరిష్ఠంగా 180 టికెట్ల వరకు మాత్రమే జారీ చేస్తారు. కల్యాణోత్సవం టికెట్లు విక్రయం ప్రారంభించిన కొద్దిసేపట్లోనే టికెట్లు దాదాపుగా అయిపోయాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అనేకమంది భక్తులు కల్యాణోత్సవం టికెట్ల కోసం ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ టికెట్ దొరకక పోవడంతో నిరాశకు గురయ్యారు. ఇదిలా ఉండగా సోమవారం స్వామివారి కోడె మొక్కు చెల్లింపు కోసం సైతం పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయ గుడి చెరువు పార్కింగ్ స్థలం నుంచి ప్రారంభమైన క్యూలైన్‌లో భక్తులు కిక్కిరిసిపోయారు. కోడె మొక్కు చెల్లింపు కోసం భక్తులు రెండు నుంచి మూడు గంటలకు పైగా వీక్షించాల్సి వచ్చింది.

రాజన్న సేవలో మంత్రి కొండా సురేఖ

వేములవాడ: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి సేవలో తరించారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి స్వామివారి ప్రసాదం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఆమె వెంట ఉన్నారు.

ఉపాధి పనుల్లో కూలీకి తీవ్రగాయాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 1: గంభీరావుపేట మండలం గోరంటాలలో సోమవారం ఉపాధి పనుల్లో కూలీకి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బండ సత్తవ్వ రోజు మాదిరిగానే ఉపాధి పనికి వెళ్లింది. పనులు చేస్తుండగా సత్తవ్వ చేతిపై పార బలంగా తగలడంతో ఎడమ చేతి నాలుగు వేళ్లు అక్కడే తెగిపడ్డాయి. తీవ్రంగా గాయపడటంతో ముందుగా సిరిసిల్ల అక్కడి నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలు

● రోడ్డుపై ధాన్యం కుప్పలతో ఘటన

వీర్నపల్లి, ఏప్రిల్ 1 : వీర్నపల్లి మండలం శాంతినగర్ గ్రామ శివారులో ప్రధాన రహదారిపై వరిధాన్యం కుప్ప ఎక్కడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి గంగాధర మండలానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గంగాధర నుంచి సిరికొండ వైపు వెళ్తున్న భాస్కర్ రోడ్డుపై పోసిన వరి ధాన్యం కుప్పలను ఎక్కించడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో చికిత్స కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

యువతి ఆత్మహత్య

పెగడపల్లి, ఏప్రిల్1: మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన పూసల వైష్ణవి (20) అనే యువతి క్రిమిసంహారక మందు తాగి ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిగ్రీ చదువుతున్న వైష్ణవి పరీక్షల్లో ఫెయిలయ్యానని బాధతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. వైష్ణవి తండ్రి రాజేశం ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జాడి రామకృష్ణ తెలిపారు.

ఘనంగా ఉగ్ర నారసింహుని ఏకాంతోత్సవం



ఉగ్ర నారసింహుని ఆలయంలో పూజలు



శేషప్ప కళావేదికపై చిన్నారుల నృత్య ప్రదర్శన

ధర్మపురి, ఏప్రిల్ 1: ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (ఉగ్ర)వారల ఏకాంతోత్సవం సోమవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అర్ధరాత్రి స్వామివారల ఉత్సవ మూర్తులను వేదిక వద్దకు తీసుకవెళ్లారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. దీంతో శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ముగిశాయి. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు నేతృత్వంలో అర్ధరాత్రి వరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు దర్శనం చేసుకుని ఉత్సవాన్ని తిలకించారు. అంతకు ముందు శేషప్ప కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శ్రీ సాయి సన్నిధి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులచే నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. కల్వచర్ల సీహెచ్ విష్ణు బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అధిగమించిన ఎన్టీపీసీ

2023-24లో 16,645 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్, ఏప్రిల్ 1: రామగుండం ఎన్టీపీసీ 2023-24 ఆర్థిక సంవత్సర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించింది. ఈ ఆర్థిక సంవత్సరం 16,600 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా(ఎంవోయూ) నిర్ణయించగా మార్చి 26న ప్రాజెక్టు టార్గెట్‌ను సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రాజెక్టులో కొన్ని సాంకేతిక, వార్షిక మరమ్మతులు తదితర అవాంతరాలు ఎదురైనప్పటికీ లక్ష్యాన్ని సాధించడం విశేషం. ప్రాజెక్టులోని 500 మెగావాట్ల 7వ యూనిట్ నిరంతరాయంగా 305 రోజులపాటు విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నది. ఇన్ని రోజులపాటు యూనిట్ నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించడం రికార్డుగా అధికారులు తెలిపారు. అలాగే 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ కేంద్రం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 196.17 మిలియన్ యూనిట్ల రికార్డు విద్యుత్ ఉత్పత్తి నమోదైంది.



రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

● బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 1: దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి, మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని శుభమంగళ గార్డెన్స్‌లో జరిగిన బీజేపీ మేనిఫెస్టో కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ మేనిఫెస్టోలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. దేశానికి ఏది అవసరమో యువత గుర్తించి లిఖిత పూర్వకంగా అందించాలన్నారు. పదేళ్లుగా దేశంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేసిందన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. మేనిఫెస్టోలో యువత భాగస్వామ్యం కోసం 17 పార్లమెంట్‌నియోజక వర్గాల్లో అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా సేకరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ యువత సూచనలు తీసుకుని బీజేపీ ప్రజా మేనిఫెస్టో రూపొందిస్తుందన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ ప్రభారి మీసాల చంద్రయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్, గంద్రనళిని, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శటి సంపత్, మాజీ మేయర్ డి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



యువత నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న కమిటీ సభ్యులు

కేసీఆర్ అనాలోచిత నిర్ణయంతోనే సాగు నీటి ఎద్దడి

● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1: రబీ పంటల సాగు కోసం నీటి విడుదలకు సరైన ప్రణాళికలు రూపొందించకపోవడంతో పాటు కేసీఆర్ అనాలోచిత నిర్ణయంతోనే సాగు నీటి ఎద్దడి ఏర్పడిందని దీనికి పూర్తిగా కేసీఆరే నైతిక బాధ్యత వహించాలని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో సోమవారం జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న నాయకులు ఇతర పార్టీలోకి వెళ్లడానికి కేసీఆర్ నిర్ణయాలు, ఎన్నికల ఫలితాల పతనమే కారణమన్నారు. తప్పులను కప్పిపుచ్చుకకు నేందుకు, ప్రజల దృష్టిని మరల్చేందుకు కేసీఆర్ ఇప్పుడు జిల్లాల పర్యటన పేరుతో పంటల పరిశీలన చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భవిష్యత్‌లో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి పంటల బీమా పథకం అమలు చేసేలా చర్యలు చేపడుతున్నారన్నారు. గడిచిన ఐదేళ్ల లో పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయని కేసీఆర్ ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే రుణ మాఫీ ఏమైందని అడుగడం హాస్యాస్పదమన్నారు. బీజేపీకి రైతు సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ కనుమ రుగు కాబోతుందన్నారు. రాష్ట్ర ఖజానాను కేసీఆర్ ఖాళీ చేశాడని దీంతో రాష్ట్రం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

పంటలు ఎండిపోవడానికి కేసీఆరే పూర్తి బాధ్యుడని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. ధర్మపురి నియోజకవర్గ సమస్యలపై రాష్ట్ర మంత్రిగా వ్యవహరించిన ఈశ్వర్ ఏనాడైనా కేసీఆర్ దృష్టికి తీసుకవెళ్లాడా అని ప్రశ్నించారు. రైతులపై కపట ప్రేమ చూపించేందుకు గాను దొంగ దీక్ష చేపట్టడం సరైంది కాదన్నారు. రాజకీయంగా పేరు తెచ్చిన ఉమ్మడి కరీంనగర్‌కు కేసీఆర్ ఏమి చేయలేదన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్, క్లబ్ సెక్రటరీ పుప్పాల అశోక్, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య ఉన్నారు.

అక్షర చిట్‌ఫండ్స్‌పై మరో కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 1: చిట్ డబ్బులు ఇవ్వకుండా, వడ్డీ చెల్లిస్తామని డిపాజిట్ చేయించుకుని మోసం చేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో కరీంనగర్‌లోని అక్షర చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. కొద్ది రోజుల క్రితం అక్షర చిట్‌ఫండ్స్ యాజమాన్యంపై కేసులు నమోదుకాగా, ఎండీ, డైరెక్టర్లను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన మిట్టపల్లి భాగ్య అనే మహిళ 2019లో రాజీవ్‌చౌక్‌లోని అక్షర చిట్‌ఫండ్స్‌లో 5 లక్షల చిట్ వేసి, లిఫ్ట్ చేయగా ఆమెకు 3,87,418 రూపాయలు వచ్చాయి. ఆ డబ్బులను చెల్లించకుండా ఖతాదారుకు మాయమాటలు చెప్పి అక్షర టౌన్‌షిప్ సంస్థలో డిపాజిట్ చేస్తే 18 శాతం వడ్డీ ఇస్తామని 4 లక్షల రూపాయలు డిపాజిట్ చేయించుకున్నారు. అప్పటి నుంచి ప్రతి నెల 6 వేల వడ్డీ 2023 సంవత్సరం నుంచి చెల్లించడం లేదు. అలాగే భాగ్య కూతురు, మరి కొందరు బంధువులను కూడా అక్షర చిట్‌ఫండ్స్ యజమాని, డైరెక్టర్లు ఇలాగే మోసం చేశారని బాధితురాలు సోమవారం కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అక్షర చిట్‌ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ పేరాల శ్రీనివాసరావు, డైరెక్టర్లు శ్రీవిద్య, ఎస్ కొండల్‌రావు, పుప్పాల రాజేందర్, గోనె రమేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎంపీటీసీపై అట్రాసిటీ కేసు

మల్యాల, ఏప్రిల్ 1: మండలంలోని బల్వంతాపూర్ ఎంపీటీసీ సంగని రవిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. మల్యాల ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 16న మండలంలోని మ్యాడంపల్లి శివారులో మల్యాల ఎంపీపీపై అవిశ్వాస సమావేశం గురించి చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో పలువురు ఎంపీటీసీలు పాల్గొనగా ఎంపీపీ అవిశ్వాస తీర్మానంపై మాట్లాడుకుంటుండగా ఎంపీటీసీ రవి నూకపల్లి ఎంపీటీసీ భర్త మారంపల్లి నారాయణను కులం పేరుతో దూషిస్తూ చంపుతానని బెదిరించాడు. ఆదివారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. 2న ఎంపీపీ అవిశ్వాస సమావేశం ఉండగా ఎంపీటీసీపై కేసు నమోదు కావడం చర్చణీయాంశంగా మారింది

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 1: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురు వ్యక్తులకు జైలుశిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 20మంది వాహనదారులను పోలీసులు సోమవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి 10 రోజులు జైలు శిక్ష, మరొకరికి 7 రోజులు, ఇద్దరికి 3 రోజుల జైలుశిక్ష, ముగ్గురికి కలిపి 10 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మిగతా 16 మంది వాహనదారులకు 23 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 1: మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులోని వరద కాలువ బ్రిడ్జి వద్ద సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో కథలాపూర్ మండలంలోని పోతారం గ్రామానికి చెందిన వెలుమల దీక్ష(20) అనే యువతి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దీక్ష నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి గ్రామంలో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లింది. తన బావ కొత్తపల్లి దీలిప్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పోతారం తిరిగి వస్తుండగా మండలంలోని రాజేశ్వర్‌రావుపేట వరద కాలువ బ్రిడ్జి వైపు వస్తున్న టిప్పర్ ఒక్కసారిగా జాతీయ రహదారిపైకి వేగంగా వచ్చి నిర్లక్ష్యంగా యూటర్న్ తీస్తుండగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెనుకాల కూర్చున్న దీక్ష టిప్పర్ టైర్ల కింద పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు. బావ దీలిప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



పిట్టల సంపత్

మానకొండూర్, ఏప్రిల్ 1: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పిట్టల సంపత్ (36) అనే రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపూర్‌కు చెందిన సంపత్ గ్రామంలో రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటున్నాడు. రెండు రోజులుగా వ్యవసాయ బావి మోటార్ పనిచేయకపోవడంతో అదే గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఆఫ్ చేసే క్రమంలో విద్యుదాఘాతంతో పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య పిట్టల మమత ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

● పరారీలో మరో నిందితుడు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 1 : మహిళ హత్య కేసులో ఒక నిందితుడిని అరెస్ట్ చేయగా మరో నిందితుడు పరారీలో ఉన్నాడని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. బీహార్‌కు చెందిన ఇద్దరు 6 నెలల క్రితం కూలి కోసం సిరిసిల్లకు వచ్చారన్నారు. సిరిసిల్లలోని అశోక్‌నగర్‌లో గది అద్దెకు తీసుకొని పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. రుడల్ సదా, రామ్బిక్స్ సదా ఇద్దరు కూలి చేసే వద్ద వేములవాడ అర్బన్ మండలానికి చెందిన ఓ మహిళతో పరిచయం పెంచుకున్నారు. మార్చి 19న సాయంత్రం 6 గంటలకు కూలి పని అయిన తర్వాత ఆమెను రూమ్‌కి తీసుకెళ్లారు. మహిళ,ఇద్దరు కార్మికులు మద్యం తాగి అదే మత్తులో ఒకరు లైంగిక కోరిక తీర్చుకొని మరొకరు అనుభవించే క్రమంలో ఆమె మత్తు నుంచి తేరుకోవడంతో ప్రతిఘటించడంతో ఎవరికైనా విషయం చెప్తుతుందనే అనుమానంతో రూమ్‌లో ఉన్న సిలిండర్ బుడ్డితో ఆమె తలపై కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బీహార్‌కు పారిపోయారని తెలిపారు. ఈ హత్యపై సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి డీఎస్పీ ఆధ్వర్యంలో సిరిసిల్ల టౌన్ సి.ఐ రఘుపతి, టాస్కోఫోర్స్ సి.ఐ ప్రవీణ్‌కుమార్, ఎల్లారెడ్డిపేట్ ఎస్.ఐ రమాకాంత్, టాస్కఫోర్స్ సిబ్బందితో స్పెషల్ టీం ఏర్పాటు చేసి, బీహార్ రాష్ట్రం ఖగారియా జిల్లా అనాపూర్ మారన్ గ్రామానికి చెందిన రామ్బిక్స్ సదా (37)ను అరెస్టు చేశామన్నారు. మరోనిందితుడైన రుడల్ సదా పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

సమస్యల చెంత.. వార సంత

● సుల్తానాబాద్‌లో రోడ్డుపైనే వ్యాపారాలు
● తైబజార్ ఆదాయం పైనే దృష్టి
● సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం

సుల్తానాబాద్, ఏప్రిల్ 1: సుల్తానాబాద్ పట్టణంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న వారసంతలో కనీస సౌకర్యాలు వసతులు లేక ఇటు విక్రేతలు అటు కొనుగోలుదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ వారు మాత్రం ప్రతీ యేటా తమ తైబజార్ ఆదాయం పైనే దృష్టి నిలుపుతున్నారు. సామాన్య రైతుల బాధలను మాత్రం పట్టించుకోవడం లేదు. సుల్తానాబాద్ పట్టణంలో ప్రతీ సోమవారం వార సంతను నిర్వహిస్తారు. దాదాపు సుల్తానాబాద్‌లోనాలుగు దశాబ్దాలుగా వారసంత కొనసాగుతోంది. ప్రారంభంలో సంతకు సమీప మండలాలకు చెందిన వందలాది మంది ప్రజలు వచ్చే వారు. తమ కుటుంబ అవసరాలకు వారం రోజులకు సరిపడా సరుకులను వస్తువులను, కూరగాయలను ఇతరత్రా వాటిని తీసుకెళ్ళేవారు. పెద్దపల్లి డివిజన్‌లోనే అతి పెద్ద వార సంతగా నిలిచింది. ఆనాటి నుంచి ఈ వారసంతను నడిరోడ్డుపైనే నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినా వార సంత పరిస్థితి మాత్రం మారలేదు. ప్రతీ సోమవారం సంత మూలంగా రాజీవ్ రహదారి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు రోడ్డుపై రాకపోకలకు ఆటంకమే. అటు మున్సిపాలిటీ నుంచి పోస్టాఫీసు నెహ్రూ విగ్రహం వరకూ కూడా సరుకులు కూరగాయలు అమ్మే వారితో కొనేవారితో రోడ్డు దిగ్బంధమే అవుతుంది. పోలీస్‌స్టేషన్ వెనుక రోడ్డులో శ్రీవాణి కాలేజీ వరకు నడవడానికి కూడా సందు దొరకని దుస్థితే.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న వార సంత

● వలస కార్మికుల రద్దీ..

సుల్తానాబాద్ పట్టణంలోని వార సంతకు సమీప మండలాల ప్రజలు పట్టణ ప్రజలతో పాటు ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున వెలసిన ఇటుక బట్టీలు, రైస్ మిల్లులు, జిన్నింగ్ మిల్లులు, ఇతర పరిశ్రమలలో పని చేసే కార్మికులు కూడా పెద్దఎత్తున వస్తుంటారు. రైస్ మిల్లుల్లో బీహార్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికు కుటుంబాలున్నాయి. ఇక ఇటుక బట్టీలలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వందలాది మంది కార్మికులు ఉన్నారు. వీరంతా సోమవారం నాటి సంతకు రావడంతో సంత నిర్వహించే రోడ్లు ఇటు సాధారణ ప్రజానీకంతోపాటు అటు కార్మికులతో కిక్కిరిసిపోతుంది. ట్రాఫిక్ సమస్యతో పాటు అనేక ఇబ్బందులు ఎదురవుతాయి.

● వసతుల కల్పనలో నిర్లక్ష్యం..

ప్రతీ ఏటా మున్సిపాలిటీ అధికారులు వార సంతతో ఎంత ఆదాయం వస్తుందనే అలోచనతోనే వ్యవహరిస్తున్నారు. ఏటా ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. కానీ వార సంతలో పాల్గొనే రైతులకు గానీ ఇతర చిరు వ్యాపారులకు గానీ సరుకులను కొనుగోలు చేయడానకి వస్తున్న ప్రజలకు మాత్రం ఎలాంటి సౌకర్యాలు వసతులు కల్పించడం లేదు. కానీ సంతలో అమ్ముకునే చిరు వ్యాపారుల నుంచి రైతులు నుంచి మాత్రం జబర్దస్తీగా తైబజార్ పన్నులు మాత్రం వసూలు చేస్తున్నారు. ఓ సామాన్య రైతు తనకు ఉన్న కొద్ది పాటి స్థలంలో కూరగాయల సాగు చేస్తే వార సంతకు వాటిని తీసుకురావడానికి ఆటో చార్జీలే ఎక్కువ. దానికి తోడు తైబజార్ పన్నులు వారికి భారమయ్యాయి. ఐదు కిలోలు పది కిలోలు కూడా తూగని కూరగాయలను, ఆకు కూరలను సంతలో అమ్ముకుందామంటే తైబజార్ పన్ను పోటు వారిని బాధిస్తోంది. చార్జీలు పన్నులు పోనూ పొద్దంతా కూర్చుంటే పైసా మిగలని దుస్థితి ఉంది. తైబాజజ్ కాంట్రాక్టర్ పేద రైతులను అని చూడకుండా నిబంధనల ప్రకారం వసూలు చేసుకుపోతాడు. ఇక ఎండలకు ఎండి వానలకు తడవం అలవాటుగా మారింది. వేసవి కాలంలోనైనా సంతలో పాల్గొనే వారికి కనీసం మంచినీటి వసతి కల్పించాలన్న ఆలోచన మున్సిపాలిటీ వారికి కరువైంది.

● తైబజార్ పన్నులు రద్దు చేయాలి..

కూరగాయల మార్కెట్‌తో సహా వార సంతలో తైబజార్ సిస్టంను వెంటనే రద్దు చేయాలని చిరువ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా ప్రస్తుత ఎమ్మెల్యే విజయరమణా రావు తైబజార్ రద్దుకు హామీ ఇచ్చారని వారు గుర్తు చేస్తున్నారు. ఇటీవల సుల్తానాబాద్ పట్టణంలో సహకార బ్యాంక్ కార్యాలయం నిర్మాణ పనుల శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యేను కలిసి తైబజార్ రద్దు విషయాన్ని ఎప్పుడు అమలు చేస్తారని అడిగారు. పేద రైతుల, చిరు వ్యాపారుల ప్రయోజనం కోసం వెంటనే తైబజార్ వేలం పాటలను రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలోని చాలా మున్సిపాలిటీల్లో ఇది లేదని వారు ఎమ్మెల్యేకు వివరించారు. అయితే త్వరలో ఈ సమస్య పరిష్కరిస్తానని చెప్పారని వ్యాపారులు తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంపై నిషేధాజ్ఞల కొనసాగింపు

కోల్‌సిటీ, ఏప్రిల్ 1: రామగుండం కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అనుమతి లేని డ్రోన్లు, డీజే సౌండ్ల వినియోగంపై నిషేధాజ్ఞలు పొడగించినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు చేస్తున్న ఆగడాలపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. మద్యం తాగి రోడ్లపై అసభ్యపదజాలంతో మాట్లాడడం, ప్రజలకు ఇబ్బంది కలిగించడం వంటివి చేస్తున్నారన్నారు. వీరి ఆగడాలకు కల్లెం వేసేందుకు నిషేధాజ్ఞలు ఏప్రిల్ 1వ తేది నుంచి మే 1వ తేది వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. అలాగే డీజే సౌండ్ల వినియోగంపై కూడా నిషేధాజ్ఞలు పొడగించామన్నారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ కోసం డీజే సౌండ్లు వినియోగిస్తున్నారన్నారు. వివిధ కార్యక్రమాలకు మైక్‌సెట్ అనుమతి తప్పనిసరి అయితే ఏసీపీ ద్వారా అనుమతి పొందాలన్నారు.

భిక్షేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మంథని, ఏప్రిల్ 1: పట్టణంలోని శ్రీభిక్షేశ్వరాలయంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు వైభవంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీభిక్షేశ్వరాస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అన్నపూజలు, మంగళహారతులను వేదోక్తంగా ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకంగా ఎక్కాహం (24 గంటల భజన) మంగళవారం ఉదయం 8 వరకు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో నయమనోహ రంగా ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అన్న, ప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

4న సర్వసభ్య సమావేశం

ముత్తారం, ఏప్రిల్ 1: ముత్తారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 4న సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీపీ జక్కుల ముత్తయ్య పేర్కొన్నారు. అధికారులు, ఎంపీటీసీలు సమావేశానికి నిర్దిష్టమైన సమయానికి హాజరు కావాలని ఆయన కోరారు.

వేణుగోపాల స్వామి ధ్వజ స్తంభానికి జలాభిషేకం

రామగిరి, ఏప్రిల్ 1: మండలంలోని కల్వచర్లలోని పురాతన వేణుగోపాల స్వామి ఆలయంలో ఏకశిలతో తయారు చేయబడిన ధ్వజస్తంభాన్ని ఈ నెల 5న ఆలయంలో పునః ప్రతిష్ఠాప మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ నుంచి కొనుగొలు చేసిన ఏకశిల ధ్వజస్తంభానికి సోమవారం పెద్దఎత్తున మహిళలు ప్రత్యేక పూజలను నిర్వహించి జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, ఉపసర్పంచ్ వెము కనకయ్య, భక్తులు వొడితల శ్రీనివాస్, బూస కనకయ్య, అంజీ, సైండ్ల సత్యానారాయణ, రవికుమార్, రేండ్ల కుమారస్వామి, రాజమౌళిగౌడ్, బూస బాపన్న, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కాలనీలో ఇఫ్తార్ విందు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 1: జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక ఆసంస్థ కార్యాయంలో ఇఫ్తార్ విందు జరిగింది. రంజాన్ నెలలో మానవుల సంస్కరణ కోసం ఖురాన్ అవతరింపజేసిన కారణంగా ఈమాసానికి అత్యంత ప్రాధాన్యం ఉంటుందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. దైవారాధన, అన్ని రకాల దురలవాట్లను దూరం చేయడం, పేదలకు సాయం చేయడం వంటి సద్గుణాలను అలవర్చుకోడానికి రంజాన్ ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మేరాజ్ అహ్మద్, అబ్దుల్‌రజాక్, మహమ్మద్ ఇస్మాయిల్, కృష్ణారెడ్డి, జక్కుల దామోదర్‌రావు, సిరాజుద్దీన్, జావిద్ అక్మల్ హుస్సేనీ పాల్గొన్నారు.

ఎన్నికలు పూర్తి కాగానే జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హామీ - టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్ 1: జర్నలిస్టులకు ఎన్నికల పూర్తి కాగానే ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేసినందుకు కార్యాచరణ రూపొందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. సోమవారం పెద్దపల్లిలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా శాఖ అధ్వర్యంలో జిల్లా శాఖ అధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్, జర్నలిస్టులు మంత్రితో పాటు పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ కు వినతి పత్రాలు అందజేశారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ తెలంగాణ ఉద్యమకారులకు ఇస్తున్న విధంగా 250 గజాల స్థలంతో పాటు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే ఆరోగ్యశ్రీతో సంబంధం లేకుండా జర్నలిస్టుల కుటుంబాలకు 10 లక్షల రూపాయల వరకు బీమా సౌకర్యాన్ని కల్పించాలని పేర్కొన్నారు. అలాగే జర్నలిస్టులకు రైతు బీమా వలే 10 లక్షల రూపాయల వరకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రస్తుతం అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో జిల్లా పాసులు గల జర్నలిస్టులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత ప్రయాణం కల్పిస్తుండగా, స్టేట్ పాసులు గల జర్నలిస్టులకు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు 1/3వ వంతు చార్జీలు తీసుకుంటున్నారని జర్నలిస్టులందరికీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని సర్వీసుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. అలాగే జిల్లాలోని ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 నుంచి 75 శాతం వరకు ఫీజుల్లో రాయితీ కల్పించాలని కోరారు. జిల్లా కేంద్రంతో పాటు మంథని, సుల్తానాబాద్ పట్టణాల్లో ప్రెస్ భవనాల నిర్మాణాల కోసం స్థలాలు కేటాయించడంతో పాటు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులు నాలుగో స్తంభం లాంటి వారని, వృత్తిపరంగా వారు ఎన్నో ఎదుర్కొంటున్నారని అన్నారు. వారు కోరిన విధంగా జర్నలిస్టులందరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేసేందుకు ఎన్నికల తర్వాత కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. అంతేకాకుండా ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్‌కుమార్, జిల్లా జాయింట్ సెక్రెటరీ బాలసాని రాజయ్య, దా డుల నివారణ కమిటీ, పెద్దపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చింతకింది చంద్ర మొగిలి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆరెల్లి మల్లేశం, లింగమూర్తి, ఎండీ గౌస్ పాషా, పెద్దపల్లి మండల శాఖ అధ్యక్షుడు వీరమల్ల విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

రామగుండంలో ఠారెత్తిస్తున్న ఎండలు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 1: ఏప్రిల్ ప్రారంభంలోనే భానుడు భగభగమంటున్నాడు. వారం రోజులుగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్టు కనిపిస్తున్నది. సోమవారం 41డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. రాత్రి వేళల్లో ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతుండగా మధ్యాహ్నం ఎండలు దంచి కొడుతున్నాయి. మధ్యాహ్నం 12గంటలు దాటితో రోడ్లపై జన సంచారం కనిపించడం లేదు. ఏప్రిల్ మాసంలోనే ఇలా ఉంటే మే మాసంలో ఎండలు ఎలా ఉంటాయోనని జంకుతున్నారు. శుక్రవారం 38.6డిగ్రీలు, శనివారం 40.0, ఆదివారం 38.6, కాగా సోమవారం 41డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఏప్రిల్ చివరి వారంలో ఉష్ణోగ్రతలు పెరగాల్సి ఉండగా మొదటి వారంలోనే సాధారణం కంటే రెండు డిగ్రీలు ఎక్కువగా నమోదు అవుతున్నాయి.

వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

మార్కండేయకాలనీ, ఏప్రిల్ 1: వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఫౌండర్ వ్యాళ్ల హరీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రామగుండం టీం సభ్యులు ఆదివారం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుడు దివంగత అబ్బోజు రాంబాబు కుమారుడి ఉన్నత చదువుల నిమిత్తం వార్షిక ఫీజు రూ.30వేలు హరీష్‌రెడ్డి తండ్రి వ్యాళ్ల రాంరెడ్డి అందించారు. అలాగే 33వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రానికి ఎయిర్ కూలర్, 32వ డివిజన్, 18వ డివిజన్ అంగన్ వాడీ కేంద్రాలకు ఎయిర్ కూలర్‌తో పాటు చిన్నారులకు చైర్స్‌ను అందజేశారు. దీంతో పాటు గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగుల కోసం అన్నదాన కార్యక్రమం, రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరంలో ఫౌండేషన్ రామగుండం టీం సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ రామగుండం టీం సభ్యులు, హరీష్‌రెడ్డి తండ్రి వ్యాళ్ల రాంరెడ్డి, జగిత్యాల జిల్లా ముంజంపల్లి వీహెచ్‌ఆర్ టీం సభ్యులు పాల్గొన్నారు.

'స్పందన'లో గ్రాడ్యుయేషన్ డే

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 13: స్పందన మోడల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే సోమవారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా జరిగింది. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యను పూర్తిచేసుకున్న చిన్నారులను ప్రోత్సహించేలా పాఠశాల యాజమాన్యం పట్టాలను అందజేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ భీంసింగ్, టూటౌన్ సీఐ బీ రవీందర్ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థుల చదువులపై ఉపాధ్యాయులకు ఎంత బాధ్యత ఉన్నదో పోషకులకు అంతే బాధ్యత ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ రవీందర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్వజస్తంబ పునః ప్రతిష్ఠాపన

ఎలిగేడు, ఏప్రిల్ 1: మండలంలోని లాలపల్లిలో సోమవారం మల్లికార్జునస్వామి ఆలయంలో ధ్వజస్తంభన పునః ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు చేసి ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుర రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వరాజే శ్వర్‌రెడ్డి, నాయకులు మైపాల్‌రుడ్డి, తిరుమల్‌రెడ్డి, కళ్ళెం శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, అశోక్‌రెడ్డి, డిలేశ్వర్ రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన సింగరేణి

- 2023-24లో 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి - 109శాతంతో ఇల్లందు ప్రథమం - ఒకే సంవత్సరం 1,658 ఉద్యోగాల కల్పన

గోదావరిఖని, ఏప్రిల్ 1: సింగరేణి సంస్థ 2023-24ఆర్థిక సంవత్సరంలో తన ఉత్పత్తి లక్ష్యాలను 100శాతం సాధించింది. 70మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యానికి గాను 70.02 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. సింగరేణి చరిత్రలో ఇది అత్యధిక వార్షిక ఉత్పత్తి. ఈ ఉత్పత్తి యజ్ఞంలో లక్ష్యంగా ఎంచుకున్న ఉత్పత్తికి గాను ఇల్లందు ఏరియా 109.2 శాతం ఉత్పత్తి సాధించి అగ్రస్థానంలో నిలువగా 72.6శాతం ఉత్పత్తితో భూపాలపల్లి చివరి స్థానంలో నిలిచింది. ఏరియాల వారీగా కొత్తగూడెం ఏరియా వార్షిక ఉత్పత్తి లక్ష్యం 12.95మిలియన్ టన్నులు కాగా 13.80మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించి 107శాతంతో లక్ష్యాన్ని అధిగమించింది. ఇల్లందులో నాలుగు మిలియన్ టన్నుల ఉత్పత్తి కాగా 4.36 మిలియన్ టన్నులు సాధించి 109.2శాతంతో నిలిచింది. మణుగూరు ఏరియా ఉత్పత్తి లక్ష్యం 11.95మిలియన్ టన్నులుకాగా 12.69మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించి 106.2శాతంతో నిలిచింది. బెల్లంపల్లిలో ఉత్పత్తి లక్ష్యం 3.65మిలియన్ టన్నులు కాగా 3.75మిలియన్ టన్నులు సాధించి 102.7శాతంతో లక్ష్యాన్ని అధిగమించింది. మందమర్రి ఏరియాలో 4.61మిలియన్ టన్నుల ఉత్పత్తికి గాను 4.19మిలియన్ టన్నులు సాధించి 91శాతంతో నిలిచింది. శ్రీరాంపూర్ ఏరియా ఉత్పత్తి లక్ష్యం 6.64మిలియన్ టన్నులకు గాను 5.90మిలియన్ టన్నులు సాధించి 88.9శాతంతో నిలిచింది. ఆర్‌జీ-1 ఏరియా ఉత్పత్తి లక్ష్యం 4.38మిలియన్ టన్నులకు గాను 4.49మిలియన్ టన్నులు సాధించి 102.6శాతం లక్ష్యాన్ని అధిగమించింది. ఆర్‌జీ-2 ఉత్పత్తి లక్ష్యం 9.65మిలియన్ టన్నులకు గాను 9.85మిలియన్ టన్నులు సాధించి 102.1శాతంతో లక్ష్యాలను అధిగమించింది. అడ్రియాల ప్రాజెక్టు ఉత్పత్తి లక్ష్యం 1.73మిలియన్ టన్నులకు గాను 1.47మిలియన్ టన్నులతో 85శాతం ఉత్పత్తి సాధించింది. భూపాలపల్లి ఉత్పత్తి లక్ష్యం 4.94మిలియన్ టన్నులకు గాను 3.58మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించి 72.6శాతంతో అతి తక్కువ ఉత్పత్తి సాధించింది.

2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణిలో మెడికల్ బోర్డు నుంచి డిపెండెంట్ ఉద్యోగాల ద్వారా వివిధ రకాలుగా 1,658మంది నూతంగా ఉద్యోగాల్లో చేరారు. సింగరేణి సంస్థ తన చరిత్రలో అత్యధిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించినందుకు కార్మికులకు, ఉద్యోగులకు, అధికారులకు, కార్మిక సంఘాల నాయకులకు సంస్థ సీఎండీ బలరాంనాయక్ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.



కార్మికులకు జ్ఞాపికను బహూకరిస్తున్న జీఎం సుధాకర్‌రావు

● ఆర్జీ-2లో 102 శాతం బొగ్గు ఉత్పత్తి

యైటింక్లయిన్‌కాలనీ: 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆర్జీ-2 ఏరియాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించింది. ఈమేరకు ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ ప్రకటనలో ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరం వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 96.50 లక్షల టన్నులు కాగా 98.50 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 102 శాతం లక్ష్యాన్ని అధిగమించినట్టు తెలిపారు. 6,89,90,000 క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత లక్ష్యానికి గాను 4,87,15,774 క్యూబిక్ మీటర్లు తీసినట్టు జీఎం పేర్కొన్నారు. రైలు, రోడ్డు మార్గాల ద్వారా 92,07,281 టన్నుల బొగ్గును రవాణా చేసినట్టు జీఎం తెలిపారు. భూగర్భ గని వకీల్‌పల్లె వంద శాతం ఉత్పత్తి సాధించినట్టు జీఎం పేర్కొన్నారు. సమిష్టి కృషితో ఆర్జీ-2 ఏరియా వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడం అభినందనీయమని జీఎం సూర్యనారాయణ అన్నారు.

గడిచిన మార్చి నెలలో ఆర్జీ-2 ఏరియా 125శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఏరియా టార్గెట్ 10,30,000 కాగా 12,92,344 టన్నులలు బొగ్గు ఉత్పత్తి జరిగింది. ఓసీపీ-3 ప్రాజెక్టు లక్ష్యం 10,00,000 టన్నులకు గాను 12,92,344 టన్నులు ఉత్పత్తి జరిగింది. 30 వేల టన్నుల లక్ష్యానికి గాను వకీల్‌పల్లె గని మార్చి నెలలో 11,808 టన్నులు సాధించింది. మార్చి నెలలో ఏరియా నుండి 10,55,360 టన్నుల బొగ్గు రవాణా జరిగింది.

● ఆర్జీ-3లో 134.. ఏపీఏలో 109 శాతం..

రామగిరి: సమిష్టి కృషితోనే మార్చి నెల ఉత్పత్తిని అధిగమించమని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్జీ-3 డివిజన్‌కు నిర్దేశించిన 5.50 లక్షల టన్నులకు గాను 7.36లక్షల టన్నులు సాధించి 134 శాతంలో నిలిచిందన్నారు. బొగ్గు ఉత్పత్తితో పాటుగా 5.57 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని వెలికితీసి 99 శాతంలో 9.18 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు. ఓసీపీ-1 సీహెచ్‌పీ మార్చి నెలలో రికార్డు స్థాయిలో రవాణా చేయడంతో కార్మికులను, అధికారులను అభినందించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్ధేశించిన 55లక్షల టన్నులకు గాను 59.11 లక్షల టన్నులు సాధించి 107 శాతంలో నిలువగా రవాణా లక్ష్యాలను అధిగమించి 85.65 లక్షల టన్నులు బొగ్గు రవాణా చేపట్టి సరికొత్త రికార్డును సొంతం చేసుకుందన్నారు. అడ్రియాల ప్రాజెక్టు ఏరియాకు ఆర్థిక సంవత్సరం నిర్ధేశించిన 17.30 లక్షల టన్నులకు గాను 14.70 లక్షల టన్నులు సాధించి 85 శాతంలో నిలిచిందన్నారు. మార్చి నెల ఉత్పత్తిలో ప్రాజెక్టు ఏరియాకు నిర్దేశించిన 1.39 లక్షల టన్నులకు గాను 1.52లక్షలను సాధించి 109 శాతంలో నిలిచిందన్నారు.

ఆర్జీ-3 లక్ష్య సాధనలో ఓసీపీ-1 కీలకం..

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-3 ఏరియా 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించడంలో ఓసీపీ-1 ప్రాజెక్టు ప్రధాన భూమిక ఉన్నట్టు ఏరియా జీఎం సుధాకర్‌రావు అన్నారు. సోమవారం ప్రాజెక్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబర్చిన ఉద్యోగులకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడారు. సింగరేణిలో ఓసీపీ-1లో 30 లక్షల టన్నుల టార్గెట్ నిర్ధేశించబడగా, 37 లక్షల టన్నుల 127 శాతం ఉత్పత్తి సాధించినట్టు సుధాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి, పీతఃశ్రీనివాస్, మేనేజర్ ఉదయ్ హరిజన్, సేఫ్టీ ఆఫీసర్ కోటయ్య, పిట్ సెక్రెటరీలు డీటీ రావు, వెంకట స్వామి పాల్గొన్నారు.

'మదర్ థెరిస్సా'లో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ ట్రైనింగ్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 1: ప్రముఖ మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ వారిచే టాస్క్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ అను అంశంపై మూడు రోజుల పాటు జరిగే ట్రైనింగ్ ప్రోగ్రాంను కళాశాల చైర్మన్ ఎడవెల్లి నవీన్ సోమవారం ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా టాస్క్ రీజినల్ మేనేజర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు నూతన మెలుకువలు నేర్చుకునేందుకు వీలుగా అన్ని రకాల ల్యాబ్ సౌకర్యాలు కల్పించబడ్డాయని ప్రశంసించారు. మహేంద్ర ప్రైడ్ ట్రైనర్ అమూల్య మాట్లాడుతూ విద్యార్థులు అత్యంత క్రమశిక్షణ మరియు అంకితభావంతో ఉండడం కళాశాల యొక్క విలువలకు నిదర్శనమన్నారు. కళాశాల డైరెక్టర్ నవత మాట్లాడుతూ ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ అనునది ఉద్యోగ సాధనలో అత్యంత ముఖ్యమైనదని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాస్, అకౌంట్స్ అధికారి పి.పవన్ కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్లు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'నవోదయ'కు న్యూబ్రిలియంట్ విద్యార్థిని ఎంపిక

జూలపల్లి, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని న్యూబ్రిలియంట్ ప్రైవేటు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మద్ది హరిణి అనే విద్యార్థిని నవోదయలో 9వ తరగతి ప్రవేశానికి ఎంపికైనట్లు ఆపాఠశాల కరస్పాండెంట్ కొండ సత్యం తెలిపారు. ఇటీవల నిర్వహించిన నవోదయ ఎంట్రెన్స్ టెస్టులో ప్రతిభ చూపి ఎంపిక కావడం పట్లా విద్యార్థిని తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేసారు.

'తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి'

ముత్తారం, ఏప్రిల్1: పట్టాదారుడికి తెలియకుండా పట్టా చేసిన తహసీల్దార్ పై కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం రైతు తీర్థాల కోమురయ్య కోరారు. మండలంలోని ప్రెస్‌క్లబ్‌లో ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన రైతు తీర్థాల కొమురయ్య మాట్లాడుతూ గతంలో ముత్తారం తహసీల్దార్‌గా పనిచేసిన పుష్పలత తన కుమారుడి పేరు మీద ఉన్న ఒక ఎకరం నాలుగు గుంటల పట్టా భూమిని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన ఒక మహిళకు అక్రమంగా పట్టా చేసిందన్నారు. దీన్ని రద్దు చేయాలని ఐదు సంవత్సరాలుగా ముత్తారం రెవెన్యూ అధికారుల చుట్టూ,ఉన్నతాధికారుల చుట్టూ తిరిగినప్పటికీ ఎవరూ స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి విచారణ చేసి అక్రమంగా పట్టా చేసిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని కొమురయ్య కోరారు. లేకుంటే తహసీల్దార్ ముందు ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని అయన హెచ్చరించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 1: మండలంలోని తారుపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ రమేష్ తండ్రి యాదగిరి, పెగడపల్లిలో బుర్రరాయమల్లులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్‌పీటీసీ గంట రాములు, బీఆర్‌ఎస్ నాయకులు నిదానపురం దేవయ్య ఉన్నారు.

నియామకం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 1: రాష్ట్ర స్థాయి ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులను రాష్ట్రజిల్లా కమిటీల్లో నియామకం చేశారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కన్నూరి బాబు,పెద్దపల్లి జిల్లా ఇంచార్జీగా కొట్టెపల్లి దుర్గాప్రసాద్, మంథని నియోజకవర్గం ఇంచార్జిగా కొయ్యల మొండిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ప్రకటించారు. సోమవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు పాపయ్య నియామక పత్రాలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పెరుక నవీన్ మాదిగ పాల్గొన్నారు.

కరాటే విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్లతో విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్1: పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి ఆదర్శ యుపీఎస్ పాఠశాలలో బీఎంఆర్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర స్థాయి బెల్ట్ గ్రౌండింగ్ పోటీలు నిర్వహించారు. నాలుగు జిల్లాల నుంచి 150మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా 50 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు అకాడమీ డైరెక్టర్ బండారి సంతోష్ తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేసి సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ చిప్ప భాస్కర్, మాజీ సర్పంచ్ కాంపెల్లి రఘు అభినందించారు. కార్యక్రమంలో కరాటే అకాడమీ ప్రధాన కార్యదర్శి కర్రే వెంకటేశ్, జాయింట్ సెక్రెటరీ రాము, లక్ష్మణ్, పెద్దపల్లి, వరంగల్, హన్మకొండ, మంచిర్యాల కోచ్‌లు రణదీప్, గణేష్, వినయ్, అభిలాష్, అభిషేక్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సొమ్మును రికవరీ చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 1 : మండలంలోని కాపులపల్లి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా అప్పులు తీసుకోని తిరిగి చెల్లించిన రూపాయలను గ్రామ సీఏ లక్ష్మీ, సీఎస్సీ నిర్వాహకురాలు పర్స స్వప్న రూ.26 లక్షలు కాజేసిన విషయం తెలిసి రెండేళ్లు కావస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, సొమ్మును రికవరీ చేయాలని అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం గ్రామంలో మహిళ సంఘాల సభ్యులు అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్‌ను కలిసి తమ సమస్యను విన్నవించారు. వెంటనే డబ్బులను రికవరీ చేసి సభ్యులకు నూతన రుణాలు అందించాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. మహిళ సభ్యులు మాట్లాడుతూ కాజేసిన డబ్బులను చెల్లించాలని అడిగిన వారిపై వారు దురుసుగా ప్రవర్తించడంతో పాటు బెదిరిస్తున్నారన్నారు. రెండేళ్లు గడుస్తున్నా వారిపై కనీసం చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో మహిళ సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేత్ర దానం

ఓదెల, ఏప్రిల్ 1: మండల కేంద్రానికి చెందిన బైరి శ్రీనివాస్ మృతి చెందడంతో సోమవారం సదాశయ ఫౌండేషన్‌కు మృతుడి కుటుంబ సభ్యులు శ్రీనివాస్ నేత్రాలను దానం చేశారు. కుటుంబానికి పెద్ద దిక్కైన శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా విషాదంలో ఉన్న కుటుంబం నేత్రదానానికి ముందుకు వచ్చి అందరికీ ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారని పలువురు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి. శ్రావణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, రాష్ట్ర కార్యదర్శి మేర్గు భీష్మచారి తదితరులు పాల్గొన్నారు. అలాగే నేత్రదాత ముంజాల లక్ష్మి సంస్కరణ సభను అల్లం సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర, అవయ, శరీర దానాలపై అవగాహన కల్పించారు.